
ప్రజాశక్తి

గురువారం 18 సెప్టెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం



22న చలో విజయవాడ

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 22న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి కోరారు. మండలంలో రామవరం, రెడ్డివానివలస, అంకంపేట, తదితర గ్రామాల్లో బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు కావస్తున్నా కౌలు రైతులకు ఎటువంటి హామీ అమలు పరచలేదన్నారు. కౌలురైతులందరూ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రాము, శంకరరావు, ఆర్.సింహాచలం, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌పై కపట నాటకం

- రాష్ట్ర స్థాయిలో అనుమతులిస్తున్న ప్రభుత్వం
- తవ్వకాలపై ప్రజల్ని మభ్యపెట్టే యత్నంలో స్థానిక కూటమి నాయకులు
- బడిదేవరకొండ బాటలోనే ఎలుగుల మెట్ట

మైనింగ్ కార్యకలాపాలపై టిడిపి కూటమి పార్టీలు కపట నాటకాలు ఆడుతున్నాయి. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న టిడిపి, జనసేన, బిజెపి.. ఏకపక్షంగా మైనింగ్ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా అనుమతులిచ్చి కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తున్నాయి. పచ్చని పల్లె ప్రజల్లో అశాంతి రేపుతున్నాయి. ఎన్నో దశాబ్దాల క్రితం నుంచి సహజ సిద్ధంగా వెలిసిన కొండలను మైనింగ్ పేరుతో ఛిద్రం చేసేందుకు లైసెన్స్‌లిస్తున్నాయి. ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల అండదండలతో మైనింగ్ తవ్వకాలకు కంపెనీ యాజమాన్యాలు దరఖాస్తు చేసి నామమాత్రంగానే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. సమీప గ్రామాల ప్రజలు వ్యతిరేకించినా అనుకూలంగా నివేదికలను తయారు చేసుకుని అనుమతులు మంజూరు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

ప్రజాశక్తి-పార్వతీపురం



మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు గతంలో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలోనే అనుమతి మంజూరైంది. ప్రజా వ్యతిరేకత కారణంగా గత ప్రభుత్వ హయాంలో బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలకు అనుమతి మంజూరు చేయలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనుమతి మంజూరైంది. గత ఏడాదిన్నర కాలంగా బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాల వల్ల ఈ ప్రాంత రైతులకు తీరని నష్టం కలిగే అవకాశం ఉంది. విశాలమైన కొండపై పడిన వర్షపునీరు చెరువుల్లోకి చేరడం వల్ల సాగు, తాగునీటి అవసరాలు తీరుతున్న పరిస్థితి నెలకొంది. కొద్ది నెలల క్రితం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బడిదేవర కొండని సందర్శించి హడావుడి చేశారు. సమీప గ్రామాల ప్రజలకు పర్యావరణ పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నెలలు గడిచినా ఆయన మాటపై ఆయనే నిలబడలేదు.

తాజాగా మండలంలోని హెచ్ కారాడవలస సమీపంలో ఉన్న ఎలుగుల మెట్ట విషయంలోనూ టిడిపి, జనసేన పార్టీల నాయకులు కపట నాటకాలు మొదలు పెట్టారు. పెదబొండపల్లి, కారాడవలస గ్రామాల ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కారాడవలస సమీపంలో ఉన్న ఎలుగుల మెట్ట కొండపై మైనింగ్ తవ్వకాలకు సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణ సభపై పెదబొండపల్లి, హెచ్.కారాడవలస గ్రామస్తులకు గాని, గ్రామ పెద్దలకు గాని ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఏర్పాట్లు చేశారు. ఆ విషయం తెలుసుకున్న గ్రామాల పెద్దలు ప్రజాభిప్రాయ సేకరణను తీవ్రంగా ప్రతిఘటించారు. తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయొద్దని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కారాడవలస గ్రామస్తులు కలిసి గ్రానైట్ తవ్వకాలకు అనుమతి మంజూరు చేయొద్దని కోరారు. ప్రజల అభీష్టాన్ని గౌరవిస్తున్నట్లుగానే నటించారు. కానీ మైనింగ్ తవ్వకాలు జరగబోవని కరాఖండిగా చెప్పలేదు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాడ మోహన్‌రావు మైనింగ్ తవ్వకాలపై ప్రజల్ని మభ్యపెట్టేవిధంగా మాట్లాడారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి మైనింగ్ తవ్వకాల అంశాన్ని తీసుకెళ్ళి నిలిపివేయిస్తామని చెప్పారు. ఇలా కూటమి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు మైనింగ్ తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంటే నియోజకవర్గ స్థాయి టిడిపి, జనసేన నాయకులు ప్రజల్ని తప్పుతోవ పట్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడిదేవర కొండ బాటలోనే ఎలుగుల మెట్ట కొండపై గ్రానైట్ తవ్వకాలకు రంగం సిద్ధమవుతోంది. వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీల నాయకులను బుజ్జగించే ప్రయత్నంలో మెస్సర్స్ వెంకట సాయి గ్రానైట్స్ కంపెనీ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.

పవన్ కళ్యాణ్ చేతిలోనే పర్యావరణ శాఖ

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేతిలోనే పర్యావరణ శాఖ ఉందన్న విషయం స్థానిక జనసేన నాయకులకు బాగా తెలుసు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కూడా ఆయన నియంత్రణలోనే ఉంటుంది. మైనింగ్ తవ్వకాలను మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని జనసేన నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లి అనుమతి మంజూరు కాకుండా అడ్డుకోవచ్చు. కానీ ఆ ప్రయత్నాలు చేయకుండా జనసేన నాయకులు మైనింగ్ తవ్వకాలు ఆపిస్తామని ప్రగల్భాలు పలకడం చర్చనీయాంశమవుతోంది.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్



వైద్య సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ద్వారా మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రజా సామాన్య వైద్య ఆరోగ్యశాల ప్రాంగణంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ జన్మదినం సందర్భంగా బుధవారం నుండి అక్టోబర్ రెండో తేది వరకూ ఈ ఉచిత వైద్య సేవలను మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. మహిళలే సమాజానికి పునాదులని, వారి ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయని తెలిపారు. ప్రతి మహిళా తన ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉంటే, అనారోగ్య సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టరు ఆర్.వైశాలి, అడిషనల్ ఎస్‌పి అంకిత సురాన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, డిసిహెచ్‌ఎస్ జి.నాగభూషణ రావు, రాష్ట్ర నోడల్ అధికారి గీతా పద్మజ, మహిళా శిశు సంక్షేమ అధికారి టి.కనకదుర్గ, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.గౌరీశ్వరి, ఎంపిపి మజ్జి శోభారాణి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగ శివ జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు

ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ప్రజాశక్తి-సీతంపేట



పార్కును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. బుధవారం సీతంపేటలో ఐటిడిఎ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో అన్ని ఈవెంట్లను పరిశీలించారు. అదే విధంగా మరిన్ని కొత్త ఈవెంట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. జలపాతం వద్ద ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ డిపిఒ సతీష్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మ్యుటేషన్లు వేగవంతం

జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి • ఆస్పత్రిలో వైద్యులు లేకపోవడంతో అసంతృప్తి

ప్రజాశక్తి-కొమరాడ



జెసితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

సుమోటో సర్టిఫికెట్లు, మ్యుటేషన్ ఫైళ్ల పరిశీలన వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కొమరాడలో సుమోటో సర్టిఫికెట్ల తనిఖీని పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలో దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఒపి ఎవరు చూస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఒపి చూసే సమయంలో డాక్టర్ అందుబాటులో ఉండాలి తప్ప ఇలా విధులకు హాజరు కాకపోతే హాస్పిటల్‌కి వచ్చే రోగులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆస్పత్రిలో రోగులు పొందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పరీక్షలు చేసే గదితోపాటు మందులు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. రోగులకు అవసరమైన అన్ని మందులు ఉన్నాయా? లేదా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బయట పడేసిన వేస్ట్ మెటీరియల్‌ను పద్ధతి ప్రకారంగా సేకరణ జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని, ఒకరు ఫీల్డ్‌కి వెళ్లినా, మరో డాక్టర్ రోగులకు అందుబాటులో ఉంటూ ఒపి వైద్య సేవలు సక్రమంగా అందించాలని స్పష్టం చేశారు. అనంతరం కొమరాడ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న సమస్యలపై ఆరాతీశారు. రెవెన్యూ శాఖలో పెండింగ్ ఉన్న మ్యుటేషన్లు, పలు ధ్రువీకరణ పత్రాలపై అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖలో ఎటువంటి పెండింగులు లేకుండా రైతులకు సేవలు అందించాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌ఒలను నియమించాలి

మండలంలో కొమరాడ, పాలెం, కెమిశీల, ఉలిపిరి పంచాయతీలకు రెగ్యులర్ విఆర్‌ఒలను నియమించాలని సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి.. జెసి యశ్వంత్‌ను కోరారు. ఆ పంచాయతీలకు విఆర్‌ఒలు ఉండటంతో పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే జాయింట్ కలెక్టర్ స్పందించి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అప్పయ్యపేట గ్రామంలో సభ కలెక్టరు ఆర్.వైశాలి బుధవారం సర్టిఫికెట్లు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారి ఉప కులాలను పరిశీలించి జారీ చేస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్న కుమార్, హెచ్‌డిటి ఉమామహేశ్వరరావు, ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి



అంగీకార్ 2025 పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌డిసి ధర్మచంద్రారెడ్డి

పిఎంఎవైఎ లక్ష్యం..

అందరికీ గృహ నిర్మాణం

ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో బలహీన వర్గాలు, మధ్యతరగతి కుటుంబాల అవసరాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని స్పెషల్ డిప్యూటి కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి అన్నారు. అందులో భాగంగా అందరికీ గృహ నిర్మాణం అనే లక్ష్యంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ పిజిఆర్‌ఎస్ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం అంగీకార్ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ గృహ నిర్మాణంలో స్తోమత, స్థిరత్వంపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పట్టణ ప్రజల విభిన్న గృహ అవసరాలను తీర్చడానికి రూపొందించబడిన నాలుగు పద్ధతుల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అంగీకార్ -2025 కరపత్రికలు, వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ కమిషనర్, ఎపి టిడ్కో పీడీ, గృహ నిర్మాణ సంస్థ డిఇ, బిఎల్‌సి, ఎహెచ్‌పిసి ఎల్‌టిసిలు, ఎమినిటీ సెక్రెటరీలు, జిల్లా సిఎల్‌టిసి అరుణ తదితరులు పాల్గొన్నారు.



మరణించిన ఎడ్లను బయటకు తీస్తున్న గ్రామస్తులు

ఉధృతంగా సువర్ణముఖి..

కొట్టుకుపోయిన ఎడ్లబండి

ప్రజాశక్తి-సీతానగరం

సువర్ణముఖి నదిలో ఎడ్లు, నాటు బండి కొట్టుకుపోయాయి. ఈ ప్రమాదంలో రెండు ఎడ్లు మరణించాయి. ఈ విషాదకర సంఘటన సీతానగరం మండలంలో బుధవారం చోటుచేసుకుంది.

సీతానగరంలోని కమలాతోటకు చెందిన సామంతుల సత్యంనాయుడు ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్నాడు. సువర్ణముఖి నదిని దాటుతుండగా ఒక్కసారి వచ్చిన వరదనీటి ఉధృతికి నాటుబండి, జతఎడ్లు కొట్టుకుపోయాయి. సత్యంనాయుడు ప్రమాదం నుంచి ఎలాగోలా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు నది వద్దకు చేరుకొని గాలించారు. వేణుగోపాలస్వామి ఆలయం రేవుకు కొద్దిదూరంలో అవురు గడ్డి పక్కన మృతిచెందిన రెండు ఎడ్లు

రెండు ఎడ్లు మృతి

కనిపించాయి. ఎడ్ల కళేబరాలను, విరిగిన నాటు బండిని ట్రాక్టర్ల సాయంతో స్థానికులు ఒడ్డుకు చేర్చారు. లక్షా 80 వేల రూపాయల విలువ చేసే ఎడ్లు కళ్లముందే మృతి చెందడంతో రైతును, ఆయన కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరం కాలేదు.

పశువైద్యులు ఎస్.రామారావు, సిబ్బంది పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం నది పక్కనే జెసిబితో ఎడ్లను పాతిపెట్టారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామని తహశీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఉన్నట్టా.. ఊడినట్టా?

- టిపిఎంయు వెలుగుకు మంగళం!
- అయోమయంలో అధికారులు
- ఆందోళనలో ఎస్‌హెచ్‌జి సభ్యులు

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని టిపిఎంయు వెలుగు అంటే తెలియనివారు ఉండేవారు కాదు. ఎందుకంటే ఐటిడిఎ కార్యాలయంలో ఒకప్పుడు వెలుగు అధికారులతో, మహిళా సంఘాల సభ్యులతో కళకళలాడేది. ఇప్పుడు అధికారులు లేక కేబిన్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు నిధులు కూడా సిసిడిపి, బాలబడులు తదితర పథకాల ద్వారా వచ్చేవి. దాంతోపాటు ఐటిడిఎలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా వెలుగు అధికారులు, మహిళా సంఘ సభ్యులు ముందుండి నడిపించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించట్లేదంటే అతిశయోక్తి కాదు.

ప్రజాశక్తి-సీతంపేట



అధికారులు లేక ఖాళీగా ఉన్న టిపిఎంయు కేబిన్లు

సీతంపేట ఐటిడిఎకు టిపిఎంయు (ట్రైబల్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ -వెలుగు) అనుబంధంగా ఉంది. ఇది 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థాపించారు. జిల్లాలో డిఆర్‌డిఎలు నెలకొల్పి మహిళా సంఘాలకు రుణాలు అందించి, తద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థాపించారు. అయితే అప్పటి పిఒ సంజయ్‌కుమార్, మరి కొంతమంది ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రభుత్వ అనుమతితో సీతంపేట, పార్వతీపురం, ఉట్నూరు ఐటిడిఎల్లో టిపిఎంయు వెలుగును స్థాపించారు. అంతవరకు బాగానే ఉంది. ఇటీవల కాలంలో టిపిఎంయు- వెలుగును ఐటిడిఎలో ఎత్తివేయడానికి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్థికంగా ముందుకు..

సీతంపేట ఐటిడిఎ టిపిఎంయు పరిధిలో మన్యం జిల్లాలోని సీతంపేట, భామిని, శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి, మందస మండలాలున్నాయి. ఈ ఏడు మండలాల్లో ఎస్‌హెచ్‌జి గ్రూపులు 10,121 ఉండగా, 209 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. 1,17,113 మంది సభ్యులు ఉన్నారు. వీరికి రుణాలు ఇవ్వడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం టిపిఎంయు లక్ష్యం. స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం కల్పించి, పిఒపి ద్వారా పేదరికం నిర్మూలించడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం చేస్తున్నారు. విడివికె ద్వారా రుణాలు అందించి జీడి ప్రాసెసింగ్, పసుపు ప్రాసెసింగ్, అగరబత్తులు తయారీ, చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడం దీని ఉద్దేశం.

కేబిన్లు ఖాళీ

రాష్ట్రంలో జిల్లాల విభజనలో భాగంగా టిపిఎంయు ఎత్తివేసి అధికారులను సర్దుబాటు చేసి డిఆర్‌డిఎలో కలిపివేయాలని సెర్ప్ రాష్ట్ర స్థాయి అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో జిల్లా స్థాయి అధికారులు డైలమాలో పడ్డారు. నాలుగు నెలల క్రితం సాధారణ బదిలీలు జరిగాయి. అందులో భాగంగా సీతంపేట టిపిఎంయు వెలుగు కార్యాలయంలో ఎపిడి మాత్రమే ఉన్నారు. ఆయన శ్రీకాకుళం నుంచి కేవలం గ్రీవెన్స్‌కి మాత్రమే సీతంపేట వస్తున్నారు. మిగతా రోజులు శ్రీకాకుళం డిఆర్‌డిఎ కార్యాలయంలో ఉంటారు. గతంలో ఇద్దరు డిపిఎంలు ఉంటే, ఒకరు పాతపట్నం క్లస్టర్, మరొకరు సీతంపేట క్లస్టర్ పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు. ఐదుగురు ఎపిఎంలు ఉంటే, బదిలీల్లో అంతా వెళ్లిపోయారు తప్ప తిరిగి ఒకరినీ నియమించలేదు.

సాధారణ బదిలీ అయినప్పటికీ తిరిగి ఎవరినీ నియమించలేదు. సర్దుబాటు పేరుతో సీతంపేట, భామిని మండలాలను పార్వతీపురం మన్యం జిల్లాలో డిఆర్‌డిఎలో కలిపితే, కొత్తూరు, పాతపట్నం, హిరమండలం, మందస, మెళియాపుట్టి మండలాలను శ్రీకాకుళం డిఆర్‌డిఎలో కలిపారు. ఏడుగురు అడ్మిషన్ అసిస్టెంట్లు(గుమస్తాలు) ఉంటే, ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో ఉన్నవాళ్లపై పనిభారం పడుతోంది. దీంతో టిపిఎంయు వెలుగుకు సీతంపేట ఐటిడిఎలో మంగళం పాడేసినట్లు తెలుస్తోంది.

ఎపిడి, ఎపిఎం పోస్టులు ఎత్తేశారు



సీతంపేట ఐటిడిఎలోని టిపిఎంయు వెలుగులో ఉన్న ఎపిడి, ఎపిఎంలు పోస్టులు ఎత్తివేశారు. పాలన పరంగా సీతంపేట, భామిని మండలాలను పార్వతీపురం డిఆర్‌డిఎ పీడీకి అప్పగించారు. కొత్తూరు, పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి, మందస మండలాలను శ్రీకాకుళం డిఆర్‌డిఎ పీడీకి అప్పగించారు. రాతపూర్వకంగా మాత్రం ఇంకా ఉత్తర్వులు రాలేదు.

-ఆర్.వి.రమణ, డిపిఎం, టిపిఎంయు వెలుగు, సీతంపేట ఐటిడిఎ



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురం

విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమంలో విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, బిసి సంక్షేమ శాఖ అధికారి అప్పన్న, విశ్వకర్మ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి ఎఆర్ డిఎస్‌పి థామస్‌రెడ్డి, పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ ఆర్‌ఐలు రాంబాబు, నాయుడు, సూపరింటెండెంట్ శంకర రావు, తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనానికి మోక్షం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన ఉన్న శిథిలమైన భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. కోట దుర్గమ్మ ఆలయ అభివృద్ధి నిధులతో శిథిలమైన భవనాన్ని జెసిబి ద్వారా తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. స్థానిక నాయకులు చొరవతో అధికారుల అనుమతితో భవనాన్ని తొలగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని 11 కెవి శంబర ఫీడర్ కింద చెట్టు కొమ్మలు తొలగించడంతో గురువారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇఇ గోపాలరావు నాయుడు వెల్లడించారు. బుధవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కవిరిపల్లి, తోటవలస, నాయుడువలస, సన్యాసిరాజపురం, చిన్నబంటు మక్కువ, మక్కువ, పెద్ద బంటు మక్కువ, అంటివలస, పుల్లేరువలస గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించాలని కోరారు.



నేత్ర శస్త్రచికిత్సలకు వెళ్తున్న రోగులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శంకర్ ఫౌండేషన్, హిందుస్థాన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆప్తాలమిస్టు దీపిక రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి 86 మందికి హాజరయ్యారు. అందులో 51 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 17 మందికి కళ్లద్దాలు అందించనున్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉషారాణి, సిహెచ్ఒ వెంకటరమణ, భవాని, జెఆర్, క్యాంప్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జువాయి, ధూళికుప్ప, తెన్నుఖర్జ తదితర గిరిజన గ్రామాల్లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్య అధికారి కె. శైలజ ఆధ్వర్యంలో సిబ్బంది వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు వ్యాధులు రాకుండా ముందుగా టీకాలు వేయించుకోవాలని పాడి రైతులకు సూచించారు. అనంతరం వర్షాకాలంలో కోళ్లు, గొర్రెల సంరక్షణ చర్యలు, జాగత్తలను వివరించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంటు అఖిలేష్, పశుసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని గడగమ్మ, కిమ్మి గ్రామాలకు చెందిన 55 కుటుంబాలు వైసిపిని వీడి, జనసేనలో చేరాయి. బుధవారం వీరఘట్టంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సమక్షంలో వారంతా జనసేన పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉండి మరింత బలోపేతం అయ్యేందుకు అందరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం చేస్తున్న మావుడి రంగునాయుడు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మక్కువ

మక్కువ గ్రామానికి చెందిన వితంతువు కిల్లంపూడి భారతికి రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని వైసిపి మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడు అందజేశారు. వితంతు పింఛను త్వరగా వచ్చేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

కొల్లాయివలస విఆర్ఒపై దాడికి యత్నం

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస విఆర్ఒ అట్టాడ రామునాయుడుపై ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దౌర్జన్యం చేయడంతో విఆర్ఒ స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిరాయదు చేశారు. కొల్లాయివలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దువ్వ అప్పలస్వామి బంధువుల పేరిట మ్యూటేషన్ పెట్టడంతో దానికి సంబంధించిన రిజిష్టర్ డాక్యుమెంట్లు అప్పటికే వుండటంతో మ్యూటేషన్‌ను విఆర్ఒ తిరస్కరించారు. దీంతో మాజీ సర్పంచ్ దువ్వ అప్పలస్వామి ఆయన తమ్ముడు దువ్వ నర్సన్న బుధవారం కొల్లాయివలస సచివాలయంలో వున్న విఆర్ అట్టాడ రామునాయుడుపై దౌర్జన్యం చేయడంతో పాటు బెదిరించి దాడికి దిగినట్లు విఆర్ఒ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తప్పుడు మ్యూటేషన్ చేయాలని గత కొంత కాలంగా ఒత్తిడి తీసుకు వచ్చినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాలు మేరకు తిరస్కరిస్తే దాడికి తెగబడినట్లు తెలిపారు.

ఎరువులు అందడం లేదు

మండల సమావేశంలో సభ్యుల ధ్వజం



ఎరువుల కోసం ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-సీతంపేట

ఎరువులు అందడం లేదంటూ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తారు. బుధవారం వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఎరువులు అందలేదని, సరిపడా రాలేదని శంభం సర్పంచ్ తిరుపతిరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు సేవా కేంద్రాల్లో దొరక్క ఇతర ప్రాంతాలకు వెళ్లి రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎరువులు అందలేదని దారపాడు సర్పంచ్ సుందరమ్మ, దోనుబాయి ఎంపిటిసి కోటేశ్వరరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. వారి వాదనతో ఎంపిపి ఏకీభవించారు. ఎఒ వాహిని స్పందిస్తూ ప్రతిపాదనలు పంపించామని, ఎరువులు వస్తాయని బదులిచ్చారు. భూ సర్వే చేపట్టాలని శంభం సర్పంచ్ తిరుపతిరావు కోరారు. రెవెన్యూ సదస్సుల్లో మ్యుటేషన్లు పెట్టినా, సమస్య పెండింగ్‌లో ఉందని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీకన్య అన్నారు. ఉపాధి హామీలో గోశాలలు నిర్మించినప్పటికీ బిల్లులు చెల్లించలేదని సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై బిల్లులు అప్‌లోడ్ చేశామని ఎపిఒ సాగర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మిశ్రో, డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, జెడ్‌పిటిసి లక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీ విద్య, ఎపి శ్రీనివాసరావు, ఎఇ సత్యం వెంకటేష్, ఎంఇఒ ఆనందరావు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ.. తల్లిదండ్రుల చెంతకు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో నడుపుతున్న వన్‌స్టాప్ సెంటర్‌కు బుధవారం ఓ సమాచారం అందింది. ఆ మేరకు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న మహిళను వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది అక్కున చేర్చుకున్నారు. సెంటర్‌కు తరలించి, కౌన్సిలింగ్ చేయటానికి ప్రయత్నిస్తే ఆమె పూర్తిగా ఒరియాలోనే మాత్రమే మాట్లాడుతోంది. తెలుగు అర్థం కాకపోవటంతో ఒరియా తెలిసిన వాళ్లతో మాట్లాడించారు. ఆమె లక్ష్మీపురం నుండి వచ్చానని, తల్లిదండ్రులు లేరని చెప్పింది. అనుమానం వచ్చి సిబ్బంది స్థానిక పోలీసులకు తెలియజేశారు. సిబ్బంది మరి కొద్దిగా ఆమెను మెప్పించి అడగడంతో ఆమె ఇంటర్ ఫెయిల్ అయినట్టు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఏమి అంటారోనని భయంతో ఆత్మహత్య చేసుకోవాలని ఊరికి దూరంగా వచ్చానని చెప్పింది. వారిది రాయగడ అని తెలిపింది. తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నెంబర్ అడిగి తెలుసుకున్నారు. వారికి ఫోన్ చేసి జరిగిన విషయం తెలియజేయడంతో అప్పటికే కూతురు కోసం అన్వేషిస్తున్నామంటూ తల్లిదండ్రులు చాలా సంతోష పడ్డారు. వారు వన్‌స్టాప్ సెంటర్‌కు చేరుకోవడంతో ఆమెను వారికి సిఐ శాంతి, కౌన్సిలర్ పల్లవి అప్పగించారు.

ఆటో డ్రైవర్ల పట్ల చిత్తశుద్ధి కరువు



ప్రచారం చేస్తున్న సిఐటియు, ఆటో యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగం, అందులో ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రమూ చిత్తశుద్ధి లేదని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ విమర్శించారు. దీనిపై గురువారం చేపట్టే ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆటోస్టాండ్ల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి లేక నిరుద్యోగ యువత ఆటో డ్రైవర్లుగా మారుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు వీరికి బ్యాంకుల ద్వారా రుణం ఇవ్వక పోవడంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి, ఆటోలను కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారిపై ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచడం, ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు, ఆర్‌టిఎ చలానాలు, ఇ-చలానా ఫైన్లు విధిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు రవాణా రంగాన్ని మొత్తం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనతో ఇప్పటికే డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీచేసే ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేసి రవాణా కార్యాలయాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఆటో, క్యాబ్, టాటా ఎసి డ్రైవర్లు నష్టపోకుండా ప్రతి డ్రైవరుకు సంవత్సరానికి రూ.30 వేలు చొప్పున ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎటిసి సెంటర్లను రద్దు చేయాలని, డ్రైవర్లను జైలుపాలు చేసే ప్రమాదకర హిట్ అండ్ రన్ చట్టంలోని సెక్షన్ 106-1, 2 రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. దీనిపై రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పార్వతీపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, యూనియన్ నాయకులు ఎన్.రాజు, ఎ.చిరంజీవి, బి.జన, ఎస్.నాగభూషణ, జి.వి.శ్రీనివాసరావు, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

రాష్ట్రంలో దగాకోరు ప్రభుత్వం

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ బాబు

ప్రజాశక్తి-పార్వతీపురం

దారుణమైన, దగా కోరు ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో పరిపాలిస్తోందని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్ బాబు విమర్శించారు. బుధవారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఎస్‌సి సెల్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకం ప్రకారం ఎస్‌సిలకు వచ్చే ప్రతి పథకాన్నీ తుంగలో తొక్కుతున్నారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. 50 వేల మంది ఎస్‌సిల పింఛన్లు తొలగించిన దుర్మార్గుడు చంద్రబాబు అని విమర్శించారు. పేదలు, దళితులు చదువుకునే పాఠశాలల నిర్మాణాలను చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేసిందని చెప్పారు. నారాయణ, చైతన్య కార్పొరేట్ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఇంటి ముందుకే మద్యం తెచ్చిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని దుయ్యబట్టారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ చేసుకోవాలన్నదే ప్రధాన ఉద్దేశం కావాలన్నారు. లేకుంటే ఎస్‌సిలకు అన్ని విధాలా నష్టం జరుగుతుందని చెప్పారు. మండల స్థాయి నాయకులు గ్రామాల్లో పర్యటించాలని, ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్, రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు కనకారావు పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి



గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు

ప్రజాశక్తి-పాచిపెంట

గిరిజనులు తాతల కాలం నుంచి సాగుచేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పాచిపెంట మండలం తాడూరు కాలనీ, శీల కొత్తవలస గిరిజనులు సాగుచేస్తున్న భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులు వంతల పాలసు, గమ్మెల లక్ష్మణరావు, మర్రి బేత్రు మాట్లాడుతూ తాడూరు రెవెన్యూ పరిధిలో 187 సర్వే నెంబరులో సాగుచేస్తున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, పథకాలు అందడం లేదన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా తమ మొర ఆలకించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సకాలంలో పట్టాలు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఈ భూములకు హక్కులు నేటికీ కూడా లేక, పెత్తందారులు అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారని తెలిపారు. వెంటనే భూములను సర్వే చేసి, పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు.



దసరా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, నాయకులు

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి

ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రజాశక్తి-పాలకొండ

ఈ నెల 22 నుంచి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. దసరా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవాలకు వచ్చిన యాత్రికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా దేవాదాయ శాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు, పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, జనసేన పట్టణ నాయకులు కె.రాజేష్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, వెన్నపు శ్రీనివాసరావు, గంగు నాయుడు, అంపోలు శ్రీను, ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ, ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

రహదారిపైకి మురుగునీరు



రహదారిపై నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-వీరఘట్టం

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉందంటూ పాలకులు సమయం వచ్చినప్పుడల్లా ఉపన్యాసాలకే పరిమితం అవుతున్నారు. అంతే తప్ప ఆ దిశగా చర్యలు లేవు. అందుకు నిదర్శనమే వీరఘట్టం మేజర్ పంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్న బాబు జగ్జీవన్‌రాం కాలనీ. కొంతకాలం నుంచి కాలువలో చెత్త, చెదారాలు తొలగించకపోవడంతో మురుగునీరు అంతా రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని దళితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడికలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా దళితవాడను పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

ఆదికర్మయోగి అమలుతీరు పరిశీలన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని పెద్దూరు పంచాయతీ బొంగుడుగూడ గ్రామంలో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమలు తీరును కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు రాహుల్ కురాన మాట్లాడుతూ గిరిజనులకు మౌలిక సౌకర్యాల కల్పనకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు పి.కోటిబాబు, ఇసి పాండు రంగారావు పాల్గొన్నారు.



బొంగుడుగూడలో పర్యటిస్తున్న కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు రాహుల్

సంతకాల సేకరణ ఉద్యమానికి మద్దతివ్వండి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఓటర్ల జాబితాలో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమానికి మద్దతు పలకాలని ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు కోరారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలకు పాల్పడి, లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి, బిజెపి ఓట్ చోరీకి పాల్పడిందని ఆరోపించారు. దీనివల్ల నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా, వారికి నచ్చిన నాయకులను ఎన్నుకొనే అవకాశాన్ని కోల్పోయారని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లను కేంద్ర ఎన్నికల కమిషన్ ముందు పెడుతూ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో ఓటర్ల జాబితా అవకతవకలపై దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రతి పార్లమెంటు, శాసనసభ నియోజకవర్గాలలో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు సంతకాల సేకరణ చేపడుతున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించనున్న సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, తమ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.



వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న వీరేశ్ చంద్రదేవ్ కుటుంబ సభ్యులు

ఘనంగా వీరేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ జన్మదిన వేడుకలు బుధవారం కురుపాంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు ,రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో, వీరేష్ నివాసంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో మహా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. వీరేష్ దేవ్ కుటుంబ సమేతంగా తిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కురుపాం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఫోన్ ద్వారా వీరేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

298 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలం లోని చలివేంద్రి, హుస్సేన్ పురం గ్రామాల్లో బుధవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వీరఘట్టం, బిటివాడ వైద్యాధికారులు ఎం.సాయి కుమార్, ఎ.మానస 298 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతికుమారి, సుభారతామని, లలిత కుమారి, ఎల్‌హెచ్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.



రోగులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి సాయికుమార్

నేడు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డిసిహెచ్‌ఎస్ నాగభూషణం తెలిపారు. బుధవారం ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం, కేన్సర్, రక్తహీనత తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చిరంజీవి, ఆర్ఎంఒ రవికుమార్, వైద్యులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పి.కోనవలస గ్రామ సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపటంతో ఎదురుగా వస్తున్న లారీ వెనుక బంపర్‌ను ఢీకొన్నాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.



బోల్తా పడిన ఆటో

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-సాలూరు రూరల్

981 కిలోల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం సీజ్ చేశారు. పట్టణంలోని బజారులో పోలీసులు మెరుపుదాడి చేసి, 49 బస్తాలను పట్టుకున్నారు. గంట చందు, మండ కామేశ్వరరావు నుంచి ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. ఇద్దరినీ సాలూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచినట్లు పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు.